

## ఆత్మహత్య

కమలాకరరావుకి చిరంజీవి ప్రతి రోజూ ధైర్యం చెప్పవలసిన అవసరం ఏర్పడింది.

"నువ్వు స్వతహాగా పిరికి వాడివి. బ్రతకడానికి కన్నా చావడానికి ఎక్కువ ధైర్యం కావాలి. ఆత్మహత్య చేసుకోవాలంటే మాటలుకాదు" కమలాకరరావుతో అన్నాడు ఒక రోజున చిరంజీవి.

"నిజమే. మరి ఈ అవమానాలు నేను భరించలేను. అందుకే చచ్చిపోవాలనుకుంటున్నాను" చెప్పాడు కమలాకరరావు.

"భరించలేని ఆ అవమానాలు ఏమిటి బాబూ" అడిగాడు చిరంజీవి.

"ఒక రోజు ఆలస్యంగా అద్దె యిస్తే యింటి యజమాని తిట్టాడు. బస్‌లో సరిగ్గా చిల్లర యివ్వకపోతే కండక్టర్ తిట్టాడు. ఆఫీసుకు అయిదు నిమిషాలు ఆలస్యంగా వెళ్తే బాస్ తిట్టాడు. అదృష్టం బాగుండి యింకా పెళ్ళికాలేదు. లేకపోతే పెళ్ళాం ఎన్నిమాటలు అనేదో" చెప్పాడు కమలాకరరావు.

"చాలా బాగుంది. అలా అయితే ప్రతి ఒక్కడూ రోజుకి కనీసం ఆరు సార్లు ఆత్మహత్య చేసుకోవాలి. ధైర్యం తెచ్చుకో. ఆనందం పెంచుకో. నేను వున్నాను బుజం తట్టి కమలాకరరావుకి చెప్పాడు చిరంజీవి.

కమలాకరరావు మిత్రుడి ఊరడింపుతో పూర్తిగా మారిపోయాడు. ధైర్యం తెచ్చుకున్నాడు.

"అద్దె ఆలస్యంగా యిస్తున్నావు. ఇలా అయితే ఊరుకోను"అని యింటి యజమాని అంటే–

"తీసుకుంటే తీసుకోండి. లేకపోతే రెండు నెలలు కలిపి పైనెల తీసుకోండి." అంటూ డబాయించడం మొదలు పెట్టాడు కమలాకరరావు.

'సరిగ్గా చిల్లర యివ్వండి' అని కండక్టర్ కసురుకుంటే–

"చిల్లర లేదు. కావాలంటే పై స్టాప్‌లో దిగిపోతాను" అని నెగ్గుకు రావడం మొదలు పెట్టాడు కమలాకరరావు.

"ఏమిటి ఎందుకు ఆలస్యం" అని ఆఫీస్‌లో బాస్ అంటే–

"అయిదు నిమిషాలే గదా అరగంట ఆలస్యం కానందుకు ఆనందిస్తున్నాను" అని తనని సమర్ధించుకోవడం మొదలు పెట్టాడు కమలాకరరావు.

కమలాకరరావు అలా మారిపోయాడు. ఆత్మహత్య అనే మాట మరచిపోయాడు. పెళ్ళి చాలా సీక్రెట్‌గా చేసుకున్నాడు. అందుకే చిరంజీవిని ఆశ్చర్యంలో ముంచుదామని ఒక రోజు కమలాకరరావు 'సతీ సమేతంగా చిరంజీవి యింటికి వెళ్ళాడు.

చిరంజీవి యింటి ముందు చాలా మంది గుమిగూడి వుండడం కమలాకరరావుకి కన్పించింది.

"ఏమిటి" అక్కడ వున్న వారిలో తెలిసిన ఒకరిని అడిగాడు కమలాకరరావు.

"చిరంజీవి ఆత్మహత్య చేసుకున్నాడు" చెప్పాడు అతను.

"ఆత్మహత్యా" ఆశ్చర్యపోయాడు కమలాకరరావు

"ఔను. 'నీ భార్యకి నీ కన్నా ఎక్కువ జీతం కదరా' అని బంధువులు, స్నేహితులు చిరంజీవితో అనే వారట. ఆ అవమానం భరించలేక చిరంజీవి ఆత్మహత్య చేసుకున్నాడట" అతను అసలు సంగతి చెప్పాడు.

తాజీ ప్రసాద్








MAM/NCL/207